భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు
భక్తులకు అన్నప్రసాద వితరణ
ఆకట్టుకుంటున్న దండియా..

ఎల్లారెడ్డి/ లింగంపేట/ కామారెడ్డి/ బాన్సువాడ రూరల్/ బాన్సువాడ టౌన్/ నాగిరెడ్డిపేట/ రాజంపేట/ నిజాంసాగర్, అక్టోబర్ 6: జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతున్నారు. రాత్రి దాండియా ఆడుతూ ఆకట్టుకుంటున్నారు. లింగంపేట మండలంలోని మెంగారం గ్రామంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారి మండపాల్లో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో అష్టాదశ దుర్గామాత భక్తుల నుంచి విశేష పూజలను అందుకుంటున్నది. బోర్లంలో హోమం నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎల్లారెడ్డిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ, ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చప్పన్‌భోగ్ సమర్పించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్యసంఘం అధ్యక్షుడు ముత్యపు సుదర్శన్, ఉపాధ్యక్షుడు సిద్ధి చక్రధర్, ఎర్ర శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. బాన్సువాడలోని పెద్ద హనుమాన్ ఆలయంలో దుర్గాదేవీని శాకాంబరిగా అలంకరించారు. అమ్మవారికి 56రకాల నైవేద్యాలను సమర్పించారు. నాగిరెడ్డిపేట మండలంలోని కిచ్చన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు లక్ష పుష్పార్చన చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. రాజంపేటలోని సరస్వతి యూత్ ఫెడరేషన్ దుర్గామాత వద్ద యజ్ఞం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కామారెడ్డిలోని ఆజాద్ హిందూ దుర్గా యువసేన సిల్వర్ జూబ్లీ సందర్భంగా వేదపండితుడు గంగవరపు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కమిటీ ప్రతినిధులు కుంబాల రవియాదవ్, శివాజీరావు, గరిపల్లి శ్రీధర్, బెల్దె విశ్వం, కృష్ణ, కిరణ్, రాజేశ్ పాల్గొన్నారు. మహ్మద్‌నగర్ మండలం కోమలంచ గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

బాన్సువాడ పెద్ద హనుమాన్ ఆలయంలో అమ్మవారికి సమర్పించిన 56రకాల మిఠాయిలు

నాగిరెడ్డిపేట మండలం కిచ్చన్నపేటలో లక్షపుష్పార్చనలో పాల్గొన్న భక్తులు

లింగంపేట మండలం శెట్పల్లిసంగారెడ్డిలో బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

కామారెడ్డిలో చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

దేశాయిపేట, రాజంపేట, ఎల్లారెడ్డిలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలు

ఎల్లారెడ్డి వైశ్యభవన్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సహస్ర దీపాలంకరణ

లింగంపేట మండలం మెంగారంలో అన్నప్రసాద వితరణ..

డీసీఎం లారీ ఢీ : ఒకరి దుర్మరణం

భిక్కనూరు, అక్టోబర్ 6: మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ఖాళీ క్రేట్లతో ఆదిలాబాద్ వెళ్తున్న డీసీఎం వాహనం ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌కు చెందిన అబీద్ అబ్దుల్(36), క్లీనర్ సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించగా.. అబీద్ అబ్దుల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. డీసీఎం డ్రైవర్ అజాగ్రత్త, అతివేగమే ప్రమాదానికి కారణమని క్లీనర్ సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

కామారెడ్డి, అక్టోబర్ 6 : పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు మంజూరు చేస్తే రానున్న బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా జరుపుకుంటామని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, మొత్తం 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో కనీసం 3 డీఏలు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నిత్యావసర సరుకులు అందజేస్తున్న బాల్‌రాజ్

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 6: పిట్లం ఎస్సీ కాలనీలో మూడు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు కాలిపోయింది. దీంతో బాధిత కుటుంబానికి వార్డు మాజీ సభ్యుడు చటారి బాల్‌రాజ్ తనవంతుగా 25కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మేస్త్రి గంగారాం, హరీశ్, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

నాగిరెడ్డిపేట, అక్టోబర్6: మండలంలోని బంజార గ్రామంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడవడంతోపాటు వరదలో కొట్టుకుపోతున్నదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

హరీశ్‌రావును కలిసిన మాజీ జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట, అక్టోబర్6: హైదరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి ఆదివారం కలిశారు. పార్టీ పరిస్థితులపై చర్చించారు. నాయకులు.. కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని హరీశ్‌రావు సూచించినట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, అక్టోబర్ 6 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ఒడి బియ్యం, పట్టె నామాలు, కోర మీసాలు, కండ్లు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

పిట్లంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం

పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 6: పిట్లంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిశూల్ దవాఖాన వైద్య సిబ్బంది 12మందిని పరీక్షించగా.. వారిలో నలుగురికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కాశిరెడ్డి, డాక్టర్ రష్మిత, వేణుగోపాల్, దయానందర్, శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న నాయకులు

లింగంపేట, అక్టోబర్ 6: మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన దుడ్డె సత్యనారాయణకు రూ.28,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ఆదివారం అందజేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు బాధితుని ఇంటికి వెళ్లి చెక్కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నగేశ్, నాయకులు భైరయ్య, సంగయ్య, మదర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 69వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

కామారెడ్డి, అక్టోబర్ 6: తెలంగాణ రాష్ట్ర స్థాయి 69వ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రొబెల్స్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు లోయపల్లి నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బాలుర విభాగంలో రంగారెడ్డి జిల్లా, ఆదిలాబాద్, వరంగల్ జిల్లా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో విశిష్ట అతిథి మధు, సీనియర్ అడ్వకేట్, ఇండియన్ రైల్వే కోచ్ శశి, బాల్ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

కామారెడ్డి, అక్టోబర్ 6 : తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లోని పటాన్ చెరువు ముదిరాజ్ భవన్ నందు ఈ నెల 3 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి యోగాసనా పోటీలు నిర్వహించారు. ఆర్టిస్ట్ ఫేర్, రిథమిక్ ఫేర్ బాలుర విభాగంలో రెడ్డిపేట తండా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందీప్ (10వ తరగతి), నవదీప్ (9వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో నిఖిత (కేజీబీవీ, మాచారెడ్డి), ఆర్టిస్ట్ ఫేర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. సీహెచ్ సహస్ర (కేజీబీవీ, మాచారెడ్డి) ట్రెడిషనల్ యోగానందు రెండో స్థానంలో నిలిచింది. వీరంతా జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి ఆదివారం తెలిపారు. వీరితో పాటు సునీత, కవిత, నిఖిత, సరస్వతి, సింధూజ, జ్యోత్స్న సబ్ జూనియర్ బాలికల విభాగంలో పతకాలు సాధించారని తెలిపారు. జూనియర్ బాలికల విభాగం నుంచి ఐశ్వర్య, అనిత, నిహారిక, కళ్యాని సైతం పలు విభాగాల్లో పతకాలు సాధించారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలుచేయాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాచారెడ్డి, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు బట్ట రమేశ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్ట వెంకట్రాములు మాట్లాడారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు ఉన్నదని తీర్పు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపడుతామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారని, అయినా మాట తప్పుతున్నారని ఆరోపించారు. వర్గీకరణ చేయకుండానే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 9వ తేదీన జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి మాదిగలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం బాబు, పొదర్ల దేవరాజు, దేవయ్య, బట్ట రమేశ్, శ్రీనివాస్, దేవరాజు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

పోచారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 6: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబురాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను సాయంత్రం హనుమాన్ ఆలయం, గ్రామ కూడళ్లలో ఒక చోట ఉంచి ఆడిపాడారు. అనంతరం గ్రామ శివారులోని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తెచ్చుకున్న సద్దులను ఆరగించారు.

బాన్సువాడలో స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం

బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 6: గురుబసంత్ స్మారక సీనియర్స్ క్రికెట్ టోర్నీని బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. బసంత్ చిత్ర పటానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని, కాసేపు బ్యాటింగ్ చేసి అందరినీ ఉత్సాహపరిచారు. బసంత్ జ్ఞాపకార్థం క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు బాల్‌నాథ్, దేవేందర్, వెంకటరమణ, పురుషోత్తం, అమానుద్దీన్, తన్నూ, యూనుస్, వాజీద్, దాసరి రవి, లక్క నరహరి, ప్రవీణ్, పద్మ శ్రీనివాస్, పంతులు నరేశ్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, ఖాలేక్, మాజీ ఎంపీటీసీ దేవీకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బాధిత కుటుంబానికి

డీఆర్డీవో మాజీ చైర్మన్ పరామర్శ

వెంకట్రాంరెడ్డిని పరామర్శిస్తున్న సతీశ్‌రెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 6: బాన్సువాడకు చెం దిన ర్యాల వెంకట్రామ్‌రెడ్డి తండ్రి సాయిరెడ్డి ఇటీవల మరణించా డు. సాయిరెడ్డి ద్వాదశ దినకర్మను ఆదివారం బాన్సువాడలోని రెడ్డి సంఘంలో నిర్వహించారు. డీఆర్డీవో మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి మాజీ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి హాజరై బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సాయిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహ్మద్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ మండలా

- నిజాంసాగర్, అక్టోబర్ 6

నిండుకుండలా పోచారం ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడుతున్న పోచారం ప్రాజెక్టు, ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 6: మండలంలోని పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉన్నది. గత నెలలో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోగా.. నెల రోజులుగా పొంగుతున్నది. పైనుంచి పొంగుతున్న నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతున్నది. ఈ ఏడాది ఇప్పటివరకు 8.393 టీఎంసీల నీరు పోచారంలోకి వచ్చి చేరగా.. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 6.120 టీఎంసీల నీరు వెళ్లిందని నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంటల కోసం ప్రధాన కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీరు వెళ్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుండలా ఉండడంతో యాసంగి పంటలకు ఢోకా లేదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.